క్లుప్తంగా

నేడు రాజమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పూసపాటిరేగ: మండలంలోని పూసపాటిపాలెంలో నూతనంగా నిర్మించిన రాజమ్మతల్లి ఆలయంలో రాజమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించనున్న కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

భోగాపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు పూర్వ విద్యార్థులు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామిజిన్న శ్రీనివాసరావు, అడపా ప్రసాద్, కాపుగంటి తాతయ్యలు, ఆచారి మాస్టారు, గుండపు నానాజీ, నాయకులు కొమ్మూరు సుభాషణరావు, ఆళ్ల ఉదయబాబు, రౌతు వాసు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో భాగంగా గాయపడిన వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

డెంకాడ: యుద్ధ వాతావరణం నేపథ్యంలో డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలీసులు, పీహెచ్‌సీ సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబు దాడిలో ప్రజలు గాయపడితే వారిని ఏ విధంగా పోలీసుల సహాయంతో ఆస్పత్రికి తరలించాలి.. ఆస్పత్రి అధికారులు, సిబ్బంది ఏ విధంగా చికిత్స అందించాలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.అనూషా, హోమియో వైద్యుడు కిశోర్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందాలన్నారు. తీర ప్రాంతానికి దగ్గరలో ఉండడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ మేరీకుమారి, ల్యాబ్‌టెక్నీషియన్ టి.గోవింద, కె.దుర్గారావు, వరలక్ష్మి, కుమారి, పి.రాణి, సీతారాజు, తదితరులు పాల్గొన్నారు.

దాడులు అమానుషం..



తహసీల్దార్ గోవిందకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు యూనియన్ నాయకులు

పూసపాటిరేగ: జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేయడం అమానుషమని పలువురు జర్నలిస్టులు ఖండించారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా సోదాలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసుల తీరును నిరసిస్తూ శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ తాడ్డి గోవిందను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా పోలీసులు ప్రవర్తించడం సరికాదన్నారు. ప్రభుత్వ లోపాలు ఎత్తి చూపే జర్నలిస్టులపై ఈ విధంగా దాడులు ఉసిగొల్పడాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టుల యూనియన్ సభ్యులు చందక లక్ష్మినాయుడు, గనగళ్ల రామారావు, బైరి అప్పారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం లోపిస్తే క్షయ వచ్చే అవకాశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ టీబీ సూపర్‌వైజర్ సజిత్

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు పౌష్టికాహారం తక్కువగా తీసుకుంటే క్షయ వ్యాధి సోకే అవకాశం ఉందని సీనియర్ టీబీ సూపర్‌వైజర్ సజిత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఘోషా ఆస్పత్రిలో గర్భిణులకు క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా గర్భిణులు క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నా, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రులు చెమట పట్టడం, కఫంలో రక్తం పడటం, ఛాతిలో నొప్పి, శ్వాస సక్రమంగా తీసుకోకపోవడం, ఆలసట, మెడవద్ద కాయలు, వాపు క్షయ వ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పద్మ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న కబ్జాదారులు

- రాజాపులోవలో ఆక్రమణల పర్వం
- శ్మశానవాటికనూ వదలని వైనం
- అధికార పార్టీ నాయకుల అండతో రెచ్చిపోతున్న కబ్జాదారులు



రాజాపులోవ శ్మశానవాటికలో వెలిసిన పాకలు

భోగాపురం: విశాలమైన జాతీయ రహదారి.. దీనికి తోడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం.. భూముల విలువ అమాంతంగా పెరగడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పాకలు వేసి పాగా వేసేస్తున్నారు. చివరికి శ్మశానవాటిక స్థలాన్ని కూడా వదలడం లేదు. అధికార పార్టీ నాయకుల అండదండలు కలిసి రావడంతో ఎవరూ అడ్డులేరంటూ తమ పని ఎంచక్కా చేసుకుపోతున్నారు. మండలంలోని రాజాపులోవ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వానికి సంబంధించి సర్వే నంబర్ – 28లో కొండపోరంబోకు స్థలంలో ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పంచాయతీ పరిధిలో మొత్తం ఆరు కులాలకు సంబంధించిన శ్మశానవాటికలో కూడా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. గట్టుచప్పుడు కాకుండా పాకలు వేసి స్థలాలను తమ అధీనంలో ఉంచుకుంటున్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బందికి ఆక్రమణల విషయం తెలిసినప్పటికీ స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకుల సహకారంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ హారిణి వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

పాఠశాలనే ఆక్రమించేశారు..



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న హరిజన వీధి ప్రజలు

భోగాపురం: మండల కేంద్రంలోని పెద హరిజన వీధిలో ఉన్న ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణం ఆక్రమణకు గురైందని, అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులను శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణం ఆక్రమణపై ఇప్పటికే స్థానిక అధికారులతో పాటు గ్రీవెన్స్‌సెల్‌లో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నారని.. అటువంటి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు మాత నవీన్, బొల్లు త్రినాథ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అక్రమాలకు అడ్డుకట్ట



రైతు బజారులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

- లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రంగారెడ్డి

విజయనగరం: అవగాహనతోనే తూనికలు, కొలతల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పీవీ రంగారెడ్డి అన్నారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని రైతుబజార్లు, షాపింగ్ మాల్స్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో ధర్మకాటా ఏర్పాటు చేసి వినియోగదారులు కొన్న సరుకుల తూకం కచ్చితంగా ఉందో లేదో పరిశీలించారు. అదేవిధంగా నగరంలోని ఓ సూపర్‌బజార్‌లో సిబ్బందికి ప్యాకేజీ వస్తువులపై పేర్కొనవలసిన వివరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు

- ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎర్రయ్యమ్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ ఎర్రయ్యమ్మ

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. ఎర్రయ్యమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రశాంత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్‌లో భాగంగా బాల్య వివాహాల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బంది పడతారని తెలిపారు. అదే విధంగా నడుంనొప్పి, నీరసం వంటి సమస్యల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లీల, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేరు చేయండి..

డెంకాడ: గ్రామాల్లో ఇంటింటికీ వస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇవ్వాలని విజయనగరం డివిజన్ పంచాయతీ అధికారి ఎ.మోహనరావు, కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ బీఎస్‌కే పట్నాయక్ అన్నారు. మండలంలోని పినతాడివాడ, గుణుపూరు గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. చెత్త నుంచి వర్మికంపోస్టు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లెంక లక్ష్మణరావు, మండల సత్యవతి, ఎఫ్‌టీసీ చంద్రకళ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.



గుణుపూరులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ మోహనరావు, కో ఆర్డినేటర్ పట్నాయక్, తదితరులు



పినతాడివాడలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముమ్మర తనిఖీలు..





భారత్ – పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు అనుమానితులపై ఆరా తీశారు. ఎక్కడ నుంచి ఎక్కడికి వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం





ఆలయ నిర్మాణానికి వితరణ..



పూసపాటిరేగ మండలంలోని గోవిందపురం పంచాయతీ గులివిందలపేటలో నూతనంగా నిర్మిస్తున్న పైడితల్లి ఆలయానికి యువ నాయకుడు బొత్స చైతన్య రూ.50 వేలు వితరణగా శుక్రవారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైడితల్లి, బంగారమ్మ, దుర్గమ్మ తల్లి కరుణా కటాక్షాలు గ్రామస్తులపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ

సంక్షేమంతో పాటు అభివృద్ధే లక్ష్యం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

నెల్లిమర్ల: సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతంలో మూడున్నర ఎకరాల్లో రూ.15.55 కోట్లతో నిర్మించే ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలిసి శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పారిశ్రామిక రంగంలో కొత్త విధానమని, తక్కువ మొత్తానికే చిన్న పారిశ్రామికవేత్తలకు లీజుకు ఇస్తామని తెలిపారు. దీని కోసం 95 శాతం రుణాలు ఎటువంటి గ్యారెంటీ లేకుండా మంజూరు చేసేలా బ్యాంకర్లకు ఒప్పిస్తామన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే నాగమాధవి అన్నారు. నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేసే పారిశ్రామిక కాంప్లెక్స్‌లో 21 యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ రాష్ట్ర చైర్మన్ శివశంకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, నెల్లిమర్ల తహసీల్దార్ సుదర్శనరావు, నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్, డెంకాడ ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాలుగు మండలాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు చనమల్లు వెంకటరమణ, అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, పతివాడ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారి విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు



సత్యసాయి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా అధ్యక్షుడు సునీల్ కుమార్ రథో

విజయనగరం టౌన్: నగరంలోని శివాలయంవీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయిబాబా మందిరంలో స్వామి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ రథో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి ఆలయం పునర్నిర్మాణంతో పాటూ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ పట్టినపు రామారావు, కన్వీనర్ పెంటపాటి అరుణ, ఓం మందిరం కన్వీనర్ సన్యాసినాయుడు, కేపీ సరోజిని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలి

- బీజేపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బూర్లె శ్రీధర్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నెల్లిమర్ల: లేబర్ కోర్టు తీర్పును అనుసరించి నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మికులకు తక్షణమే గ్రాట్యుటీ చెల్లించాలని బీజేపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూర్లె శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్‌తో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. 13 మంది జూట్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలని లేబరు కోర్టు ఆదేశాలిచ్చి ఏడాదిన్నరైనా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే ఇందులో ఇద్దరు జూట్ కార్మికులు మృతి చెందారని, మిగిలిన వారికైనా న్యాయం చేయాలని కోరారు. గ్రాట్యుటీ చెల్లింపులు చేయకుండా తాత్సారం చేస్తున్న మిల్లు యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చందక గోవిందరావు, నాయకులు దోమ నాగార్జున, వెలిచేటి రమేష్ బాబు, కార్మికులు పాల్గొన్నారు.

'సాక్షి'పై కక్ష సాధింపు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఎడిటర్ల ఇళ్లపై దాడులు చేయించడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎలాంటి సెర్చ్ వారంట్, ముందస్తు నోటీసు లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో దౌర్జన్యంగా పోలీసు అధికా రులు సోదాలు చెయ్యడం, అలాగే ఆయనపై ఏసీపీ దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని, ఇంతకముందెప్పుడూ రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి లేదని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పుణ్యమాని రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం ఎలాగూ లేదని, ఇప్పుడు భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని, మళ్లీ బ్రిటిష్ పరిపాలన గుర్తుకు తెస్తున్నారని మండిపడ్డారు. న్యాయస్థానాల తీర్పులు కూడా పట్టించుకోకుండా సాక్షి పత్రికకు సంకెళ్లు వెయ్యాలని, మీడియా గొంతు నొక్కాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. కచ్చితంగా ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. కూటమి ప్రభుత్వం ఈ పదినెలల పాలనలో కక్ష సాధింపు చర్యలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి మీద కేసులు పెట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని, పథకాలు అమలు చేసిందీ లేదన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, ఎందుకు వీరిని అధికారంలోకి తెచ్చామా అంటూ బాధపడుతు న్నారన్నారు. రాబోయే కాలంలో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.